ప్రతి ఒక్కరూ.. మొక్కలు నాటాలి

గాంధీ దవాఖాన ఆవరణలో మొక్క నాటుతున్న దవాఖాన సూపరింటెండెంట్ రాజారావు

బన్సీలాల్‌పేట్, జూలై 9 : గాంధీ దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.రాజారావు మంగళవారం తన పుట్టినరోజు సందర్భంగా దవాఖాన ఆవరణలో మొక్కలు నాటారు. ప్రతి ఏడాది ఒక మొక్కను నాటడం ఆనవాయితీగా పెట్టుకున్నానని, సహచర వైద్యులు, సిబ్బంది కూడా మొక్కలు నాటాలని ఆయన తెలిపారు. జీడీఎక్స్ సంస్థ ప్రతినిధి రవికుమార్, చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ శివాజీ, గార్డెనింగ్ ఆఫిసర్ యోహాన్ పాల్గొన్నారు.

నేడు మోండా మార్కెట్‌లో అన్నదానం

మారేడ్‌పల్లి, జూలై 9: సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ సోదరుడు తలసాని శంకర్ యాదవ్ జ్ఞాపకార్థం బుధవారం మోండా మార్కెట్‌లో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మోండా మార్కెట్ డివిజన్ మాజీ కార్పొరేటర్ ఆకుల రూప హరికృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తో పాటు, శంకర్ యాదవ్ సోదరులు హాజరై అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు.

ఆరు గ్యారెంటీలు అమలు చేయాలి

కాచిగూడ: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను వెంటనే అమలుచేయాలని మంగళవారం ఇందిరాపార్క్ ధర్నాచౌక్‌లో తెలంగాణ బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నా కార్యక్రమానికి కాచిగూడ కార్పొరేటర్ ఉమా రమేశ్‌యాదవ్ ఆధ్వర్యంలో భారీ ఎత్తున కార్యకర్తలు తరలివెళ్లారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

మహిళలు ఆర్థికంగా బలోపేతం చెందేందుకు తన వంతు కృషి చేస్తానని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ అన్నారు. మంగళవారం ఏడో వార్డు పరిధిలోని ఓల్డ్ గాంధీ నగర్‌లో హైదరాబాద్ ఆర్చ్ డయాసిస్ సోషల్ సర్వీస్ సొసైటీ చైర్మన్ కార్డినల్ పూల ఆంథోని ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హెచ్ఏఎస్ఎస్ కుట్టు మిషన్ శిక్షణా కేంద్రాన్ని ఎమ్మెల్యే శ్రీ గణేష్,సొసైటీ చైర్మన్ పూల ఆంథోనితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..మహిళలకు వృత్తి నైపుణ్యం అందించడం ద్వారా సాధికారత సాధించవచ్చని తెలిపారు.మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలని సూచించారు.మహిళలకు సహకారం అందిస్తున్న ఆర్చ్ డయాసిస్ సేవలను అభినందించారు.ఈ కార్యక్రమంలో హౌస్ డైరెక్టర్ మధు,ప్రదీప్,రంజిత్,సరిత,భవానీ,జోసఫ్ పాల్గొన్నారు. – బొల్లారం

కల్యాణం సేవలో... బల్కంపేట ఎల్లమ్మ తల్లి కల్యాణ మహోత్సవ వేడుకల్లో కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ మంగళవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కంటోన్మెంట్ ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని, నియోజకవర్గం అభివృద్ధి పై అమ్మవారి అనుగ్రహం ఉండాలని అమ్మవారిని కోరుకున్నట్లు ఎమ్మెల్యే శ్రీ గణేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. – మారేడ్‌పల్లి, జూలై 9:

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

స్కూల్ విద్యార్థులతో మాట్లాడుతున్న డీసీ సుభాష్

అడ్డగుట్ట, జూలై 9 : పరిసరాల పరిశుభ్రత ద్వారానే సీజనల్ వ్యాధులను అరికట్టవచ్చునని జీహెచ్ఎంసీ సికింద్రాబాద్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సుభాష్ సూచించారు. మంగళవారం మెట్టుగూడ డివిజన్ విజయపురి కాలనీలోని బస్తీ దవాఖానను స్థానిక కార్పొరేటర్ రాసూరి సునీతతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా రోజు వారీగా నమోదవుతున్న జ్వరం, మలేరియా, డెంగ్యూ కేసుల వివరాలను వైద్యుల ద్వారా అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్థానికంగా ఉన్న స్కూల్‌లో విద్యార్థులను కలిసి వ్యాధుల వ్యాప్తి, నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీసీ మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. జ్వరం, మలేరియా, డెంగ్యూ లక్షణాలు కనిపిస్తే ఎవరు కూడా నిర్లక్ష్యం చేయవద్దని, వెంటనే దగ్గర్లో ఉన్న ఆసుపత్రి వైద్యులను సంప్రదించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎమ్‌హెచ్ఓ రజినీకాంత్, బస్తీ దవాఖాన వైద్యులు, ఎంటమాలజీ అధికారులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ పరిషత్ భవన నిర్మాణానికి కృషి చేయాలి

అడ్డగుట్ట, జూలై 9 : కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్‌ను బ్రాహ్మణ సేవా వాహిణి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు శేషం రఘుకిరణాచార్యుల ఆధ్వర్యంలో మంగళవారం ప్రతినిధులు కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు శాలువా కప్పి జ్ఞాపికను అందజేశారు. కంటోన్మెంట్ నియోజకవర్గంలో బ్రాహ్మణ పరిషత్ భవన నిర్మాణానికి కృషి చేయాలని, అదేవిధంగా బ్రాహ్మణ పరిషత్ పథకాలు అమలయ్యేలా చూడాలని కోరినట్లు అధ్యక్షులు రఘుకిరణాచార్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ ప్రతినిధులు వెంకటేశ్వర శర్మ, సీతారామ శాస్త్రి, కొండపల్లి రాకేష్ కుమార్, వెంకటేశ్వర రావు, సుధాకర్ రావు, పవన్‌కుమార్, శేషం శ్రీకర్, శ్రీనివాస శర్మ పాల్గొన్నారు.

శుభాకాంక్షలు: తుకారాంగేట్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన మాలోతు శంకర్‌ను అడ్డగుట్ట డివిజన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గంటా రాజుసాగర్ ఆధ్వర్యంలో నేతలు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆయనను శాలువాతో సత్కరించారు. సీఐని కలిసిన వారిలో అనంత కృష్ణ, మందా ప్రభాకర్, మంజి, హరి, రామలీల, హరి తదితరులు పాల్గొన్నారు. – అడ్డగుట్ట, జూలై 9 :

విద్యార్థులకు టై బెల్ట్‌లను అందజేస్తున్న ప్రధానోపాధ్యాయులు మల్లికార్జున్

విద్యార్థులకు టై బెల్ట్‌లు అందజేత

అడ్డగుట్ట, జూలై 9 : పేద విద్యార్థులను ప్రోత్సహించేందుకు స్వచ్ఛంద సంస్థలు, సంఘ సేవకులు ముందుకు రావడం అభినందనీయమని ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మల్లికార్జున్ అన్నారు. మంగళవారం మెట్టుగూడ డివిజన్ దూద్‌బావిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు బొడ్డు యాదగిరి స్వచ్ఛందంగా టై బెల్ట్‌లను అందజేశారు. ఈ సందర్భంగా మల్లికార్జున్ మాట్లాడుతూ... స్వచ్ఛంద సంస్థలు అందిస్తున్న సహకారాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మల్లీశ్వరి, హసీనా బేగం పాల్గొన్నారు.

యువతను క్రీడల్లో ప్రోత్సహించాలి



బాక్సింగ్ పోటీ విజేత ఆంటోనీని అభినందిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

బన్సీలాల్‌పేట్, జూలై 9 : క్రీడలలో యువతను ప్రోత్సహించాలని, తద్వారా దేశ ఖ్యాతి ఖండాంతరాలకు వ్యాపిస్తుందని కేంద్ర మంత్రి జీ.కిషన్ రెడ్డి అన్నారు. బన్సీలాల్‌పేట్‌లోని యువ శక్తి ఆటోడ్రైవర్స్ అసోసియేషన్‌కు చెందిన విజయ్‌కుమార్ కొడుకు ఆంటోనీ, ఇటీవల హర్యానాలో జరిగిన జాతీయ బాక్సింగ్ పోటీలలో అండర్ –16 విభాగంలో పాల్గొని గోల్డ్ మెడల్ సాధించి విజేతగా నిలిచాడు. మంగళవారం తన నివాసానికి వచ్చిన విజేత ఆంటోనీని ఆయన అభినందించారు. బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ కన్వీనర్ టి.రాజశేఖర్‌రెడ్డి, ఆటో యూనియన్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఎల్లమ్మ కల్యాణం

బోయిగూడలోని మేకలమండి ఎదురుగా ఉన్న శ్రీ ఎల్లమ్మ దేవాలయం వద్ద మంగళవారం అమ్మవారి కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ, వందలాది మంది భక్తుల సమక్షంలో అత్యంత వైభవంగా కల్యాణం నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు కే.విజయ్ కుమార్ ఆధ్వర్యంలో అమ్మవారి కల్యాణానికి ఏర్పాట్లు చేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. రామ్, రాఘవ పంతులు, కమిటీ సభ్యులు శ్రీహరి, కృష్ణన్న, సునాయన నసారియా, శేఖర్, కమల్, కిషన్, విజయ్‌శంకర్‌లు పాల్గొన్నారు. – బన్సీలాల్‌పేట్, జూలై 9

అన్నదానం: కంటోన్మెంట్ అన్నానగర్‌లో శ్రీ రేణుకా ఎల్లమ్మ కల్యాణ మహోత్సవం సందర్భంగా మంగళవారం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ టీఎన్ శ్రీనివాస్ అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు.అనంతరం భక్తులకు అన్నం వడ్డించారు. – బొల్లారం

అడుగడుగునా అన్నదాన శిబిరాలు

ఎల్లమ్మ కల్యాణోత్సవానికి వచ్చే భక్తుల కోసం బల్కంపేట వాసులు అడుగడుగునా అన్నప్రసాద కేంద్రాలు ఏర్పాటు చేయడంతో ఎటువంటి ఇబ్బందులు లేకుండానే భక్తుల ఆకలి తీరింది. ఉదయం నుంచి అల్పాహార వితరణ కేంద్రాలు, మధ్యాహ్నం 12 నుంచి అన్నప్రసాద వితరణ కేంద్రాలు పని చేశాయి. ప్రతియేటా అన్నదాన శిబిరాన్ని నిర్వహించే బల్కంపేట గడి మైసమ్మ దేవాలయ ప్రతినిధులు కొత్తపల్లి శంకర్‌గౌడ్, ప్రభుగౌడ్, రాజుగౌడ్, మురళిగౌడ్‌లు భక్తులకు అన్నదానం చేశారు. – అమీర్‌పేట్, జూలై 9

కేసరి హనుమాన్ దేవాలయం చైర్మన్‌గా మహేందర్

బేగంపేట్ శ్రీదేవి కట్టమైసమ్మ ఆలయం సమీపంలో ఉన్న కేసరి హనుమాన్ దేవాలయం చైర్మన్‌గా డీవీ మహేందర్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ క్రమంలో బీఆర్ఎస్ పార్టీ బేగంపేట్ డివిజన్ ప్రధాన కార్యదర్శి నరేష్ ఆధ్వర్యంలో నాయకులు పద్మా రెడ్డి, సత్యనారాయణ, దీప్‌కుమార్, నవీన్‌లు కలిసి మహేందర్‌ను ఘనంగా సత్కరించారు. అనంతరం మహేందర్ మాట్లాడుతూ.. దేవాలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తనవంతు కృషి చేస్తానని తెలిపారు. – బేగంపేట్ జూలై 9:

ఓయూలో మంత్రి సీతక్క

పుట్టిన రోజు వేడుకలు

తెలంగాణ పంచాయతీ రాజ్,గ్రామీణ అభివృద్ధి మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క పుట్టిన రోజు వేడుకలను ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజ్ ఆవరణలో మంగళవారం ఘనంగా నిర్వహించారు.అనంతరం నాయకుల సమక్షంలో కేక్ కట్ చేశారు. సమ్మక్క,సారలమ్మ ధిక్కార వారసత్వాన్ని, కొమురం భీం పోరాట తత్వాన్ని పుణికి పుచ్చుకున్న, ఆదివాసి ఆడ బిడ్డ, ములుగు ప్రజల ముద్దు బిడ్డ అని నాయకులు కొనియాడారు. ఈ సందర్భంగా ఆది వాసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు సాగబోయిన పాపారావు మాట్లాడుతూ.. తన మన అనే భేదం లేకుండా అన్ని వర్గాల ప్రజలను అక్కున చేర్చుకునే మంచి మనసున్న నేత సీతక్క అని అన్నారు. ఈ కార్యక్రమంలో నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు వాలువాయి ఉషా కిరణ్, ప్రొఫెసర్ గాలి వినోద్ కుమార్, ఓయూ జేఏసీ నేతలు గాదె వెంకట్, వలిగొండ నరసింహ, ఆదివాసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరేం అరుణ్ కుమార్ కుమార్, గౌరివేని ప్రవీణ్ కుమార్ తదితర నాయకులు పాల్గొన్నారు. – సికింద్రాబాద్



మెట్టుగూడలో ఘనంగా

ఎల్లమ్మ కల్యాణం

మెట్టుగూడ పాండవబస్తీలో మంగళవారం నిర్వహించిన ఎల్లమ్మ కల్యాణమహోత్సవం కనుల పండువగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్ సీఆర్ ప్రజాసేవ వ్యవస్థాపకులు, బీజేపీ సీనియర్ నాయకులు మ్యాకల చంద్రశేఖర రావు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చిలకలగూడ కట్టమైసమ్మ ఆలయ చైర్మెన్ గుంటి కృష్ణ, జాక్, నందు పాల్గొన్నారు. – అడ్డగుట్ట, జూలై 9 :



బోయిన్‌పల్లి బాపూజీ నగర్‌లో శ్రీ నల్లపోచమ్మ ఆలయం 15వ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్ రెడ్డి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.ఈ కార్యక్రమంలో నర్సింగ్ గౌడ్,బండి రాజు,నవీన్,శ్రీధర్,యుగేందర్,వారి తదితరులు పాల్గొన్నారు.

తాగునీరు సరఫరా: బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారి కల్యాణోత్సవానికి లక్షలాదిగా తరలివచ్చిన భక్తులకు ఇబ్బంది లేకుండా క్యూలైన్‌లో ఉన్న భక్తులకు మంచినీటి బాటిళ్లను అందజేశారు.

జర్మనీలో ఉద్యోగాల భర్తీ కోసం దరఖాస్తుల ఆహ్వానం

సుల్తాన్‌బజార్, జూలై 9 : జర్మనీలో ఉద్యోగాల భర్తీ కోసం బీఎస్సీ, జీఎన్ఎం నర్సుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు హైదరాబాద్ జిల్లా ఉపాధి కల్పన అధికారి ఎస్. మైత్రీ ప్రియ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. టామ్‌కామ్, ఫెడరల్ ఎంప్లాయిమెంట్ ఏజెన్సీ ఆఫ్ జర్మనీ ప్రభుత్వ భాగస్వామ్యంతో జర్మనీ భాషా శిక్షణలో ట్రిపుల్ విన్ ప్రాజెక్ట్ కింద జర్మనీలో నర్సుల ఉద్యోగాల భర్తీ కోసం ఈ నెల 9 నుంచి 17 వరకు ఇంటర్వ్యూలను నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. అభ్యర్థులు బీఎస్సీ, జీఎన్ఎం విద్యార్హతతో పాటు 21 నుంచి 38 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి ఉండాలన్నారు. తెలంగాణలో గుర్తింపు పొందిన కళాశాల నుంచి నర్సింగ్, ఐసీయూ, జెరియాట్రిక్, ఆర్థోపెడిక్, సైక్రి యాట్రిక్, కార్డియాలజీ , నియోనాటల్, సర్జికల్ వార్డులలో 1 నుంచి 3 సంవత్సరాల ప్రొఫెషనల్, క్లినికల్‌లలో పని చేసిన అనుభవం ఉండాలని, జర్మన్ భాషా నైపుణ్యం కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఇంటర్వ్యూలలో ఎంపికైన అభ్యర్థులు తమ బీ1 భాషా శిక్షణను భారతదేశంలో విజయవంతంగా పూర్తి చేసిన అనంతరం జర్మనీలో నర్సింగ్ అసిస్టెంట్‌గా పని చేసే అవకాశం ఉంటుందని, జర్మనీలో బీ2 గుర్తింపు పరీక్షను క్లియర్ చేసిన అనంతరం రిజిస్టర్డ్ నర్సుగా పదోన్నతి చేయబడుతారన్నారు.

జర్మన్ భాషా శిక్షణ ఉచిత మని అన్నారు. ఓవర్ టైం మినహాయించి 2,300 నుంచి 2,800 యూరోల కనీస వేతనం ఉంటుందన్నారు. జర్మన్ భాషా పరీక్షను పూర్తి చేసిన అనంతరం ఎంపిక చేసిన అభ్యర్థులకు స్టైఫెండ్ చెల్లించబడుతుందన్నారు. ఏ2 పరీక్షను పూర్తి చేసిన వారికి 250 యూరోలు, బీ1 పరీక్షను పూర్తి చేసిన వారికి 250 యూరోలు ఇవ్వడం జరుగుతుందని అన్నారు. అన్ని వీసా, ఇమ్మిగ్రేషన్ ప్రక్రియ, వన్ వే ఫ్లైట్ టిక్కెట్లను టామ్‌కామ్ ఉచితంగా అందించబడుతాయన్నారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు ఈ నెల 9 నుంచి 17వరకు 9908830 438/8919047600 / 7032379066/ 8499990 304/6302292450 నంబర్లలో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని తెలిపారు. లేదా ఈ నెల 17వరకు బేగం పేట్‌లోని హోటల్ ది ప్లాజాలోని రెండవ అంతస్తులో నేరుగా తమ దరఖాస్తులను సమర్పించవచ్చని అన్నారు.

మరింత సమాచారం కోసం www.tomcom.telangana.gov.in లో లేదా టామ్‌కామ్ మొబైల్ యాప్‌లో సందర్శించాలని ఆమె కోరారు.

బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారి కల్యాణోత్సవం మంగళవారం వైభవంగా జరిగింది. సర్వాంగసుందరంగా తీర్చిదిద్దిన వేదిక మీద అశేష సంఖ్యలో భక్తులు తిలకిస్తుండగా ఎల్లమ్మ వారు జమదగ్ని మహర్షిని (త్రిశూల రూపం) వివాహమాడారు. ఎల్లమ్మ అమ్మవారికి ప్రభుత్వం తరపున దేవాదాయ శాఖా మంత్రి కొండా సురేఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్‌లు తలంబ్రాలు, పట్టు వస్త్రాలను సమర్పించారు. భక్తులు అధిక సంఖ్యల్లో హాజరై అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. బల్కంపేట అమ్మవారి కల్యాణ మహోత్సవానికి వచ్చిన భక్తులకు ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం తరుపున మౌలిక వసతులు కల్పించారు. –అమీర్‌పేట్